క్లుప్తంగా

వైభవంగా దండుమారెమ్మ ఉత్సవాలు



దండుమారెమ్మ జాతరకు పోటెత్తిన జనం

గణపవరం: గణపవరం గ్రామ ఇలవేల్పు శ్రీదండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజు సోమవారం ఆలయం భక్తులతో పోటెత్తింది. పరీక్షల సీజన్ కావడంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గణపవరం పరిసర గ్రామాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయం వద్ద నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి లాస్యశ్రీ నృత్య నికేతన్ తణుకు వారు చిన్నారులతో ప్రదర్శించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రదర్శన

గణపవరం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యార్థులదేనని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం డిగ్రీ కాలేజి విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లోకి గంజాయి వంటి మాదకద్రవ్యాలు ప్రవేశించడం ఆందోళనకరమని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-పంట రైతుల జాబితా ప్రచురణ



సరిపల్లె రైతుసేవా కేంద్రంలో ఈ పంట రైతుల జాబితాను ప్రకటిస్తున్న అధికారులు

గణపవరం: మండలంలోని 20 రైతు సేవా కేంద్రాల్లో సోమవారం ఈ-పంట రైతుల జాబితాను ప్రకటిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. సరిపల్లె రైతుసేవా కేంద్రం వద్ద డ్రాఫ్ట్ లిస్టును సర్పంచ్ చనుమూరి దుర్గాభవానిశివ చేతులమీదుగా ప్రకటించారు. జాబితాలను ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో గ్రామ సభ ఏర్పాటుచేసి జాబితాలోని పేర్లను రైతులకు చదివి వినిపిస్తామని తెలిపారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా రైతులంతా తాము వేసిన వరి రకం ఒకేవిధంగా ఉండేలా చూడాలని, మిగిలిన విషయాలు కూడా పరిశీలించి తప్పులు ఉంటే సరిచేసి తుది జాబితాను ఈనెల 22వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశ్వేశ్వరరావు

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల బస్టాండ్ వద్ద సోమవారం దుద్దేపూడి ఎస్టేట్ జమీందార్ వంశీకురాలు ఏలూరుకు చెందిన వర్ధినీడి వెంకట వినుత ఆర్థిక సాయంతో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు కేతినీడి విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండుతున్న వేళ రహదారులపై ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు మజ్జిగ చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: చేబ్రోలులో మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏలూరు డీఈ అంబేడ్కర్ తెలిపారు. 33/11 కేవీ చేబ్రోలు కొత్త లైను నిర్మాణం నిమిత్తం ఈనెల మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


సుర్రుమంటున్న ఎండలు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పెదవేగి : అప్పుడే ఎండలు సుర్రుమంటున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఎండ తీవ్రతకు పాఠశాలల దగ్గర నుంచి కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడే ఇంత ఎండలు ఉంటే ఇంకా ముందుముందు ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా మార్చి నుంచి ఎండలు ప్రారంభమైనా మే నెలలో తీవ్రంగా ఉంటాయి. అయితే ఈ సంవత్సరం మార్చి ప్రారంభంలోనే ఎండలు ఉధృతంగా ఉండడంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఎండవేడి నుంచి ఉపశమనానికి కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, ముంజులు, జ్యూస్‌లు, చల్లని పానియాలను ఆశ్రయిస్తున్నారు.

40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు

జిల్లాలో అప్పుడే ఎండలు మండుతున్నాయి. శీతగాలులు ఆఖరిదశ కొనసాగాల్సిన మార్చిలో పగటి ఉష్ణోగ్రత అనేకచోట్ల 37 డిగ్రీలకు చేరింది. చలి వాతావరణం తగ్గుముఖం పడుతుందని, రాబోయే వారం రోజుల్లో ఎండవేడిమి మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఖగోళ పరిశీలనల ప్రకారం గడిచిన రెండు దశాబ్దాల్లో 2021 నాటి ఎండకాలం తీవ్రత చాలా ఎక్కువ. ఈ సంవత్సరం దానికి మించి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఓజోన్ పొరలో క్రమేపీ పెరుగుతున్న ఒత్తిడికి తోడు గతం కంటే పచ్చని వాతావరణం కనుమరుగు కావడమే దీనికి కారణమని చెబుతున్నారు. చిత్తశుద్ధితో మొక్కల పెంపకం చేపట్టి, పచ్చదనం పెంచితే వేసవి అంతగా జనంపై ప్రతాపం చూపదని అధికారులు ఆ దిశగా పయనిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రజలు చెబుతున్నారు.



నిర్మానుష్యంగా పెదవేగి ప్రధాన రహదారి



దుగ్గిరాల జాతీయ రహదారిపై నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం



వట్లూరు గేట్ వద్ద కొబ్బరి నీళ్లను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. శరీరంలో నీరు శాతం తగ్గకుండా చూసుకోవాలి. సోడియం, పొటాషియం వంటివి తగ్గడంతో మనిషికి తలనొప్పి, కండరాల నొప్పి, స్పృహ కోల్పోవడం, వంటివి జరుగుతాయి. ముఖ్యంగా కూలిపనికి వెళ్లే వారు ప్రతి రోజు కనీసం 5 లీటర్ల నీరును తాగాలి. ఈ వేడిమి ప్రభావం చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా ఉంటుంది. వారిని జాగ్రత్తగా చూసుకోవాలి.

– పిల్లా పూర్ణిమ, వైద్యాధికారి, పెదవేగి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉంగుటూరు నెం 1 పాఠశాలలో మహిళలను సత్కరించిన దృశ్యం

ఉంగుటూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. సోమవారం ఉంగుటూరు నెం.1 పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను బాగాచదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పాఠశాల కమిటీ ఉపాధ్యక్షురాలు అంబికాదేవి, ప్రభుత్వ ఆయుర్వేద డా. కె.శిరీష, ఉపాధ్యాయులు పి.దుర్గ మల్లేశ్వరి, మిక్కిలి ప్రశాంతి, సరోజినీ, టి.సుభాషిణి, శానిటరీ వర్కర్ కె.పద్మావతి, కవిత, ఎండిఎం ఏజెన్సీ సభ్యులు గంగారత్నం, ఎం.వెంకటలక్ష్మి, పి.అరుణకుమారి, నిర్మల, సోనియాలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం సిరి మామిళ్ల పెద్దిరాజు అధ్యక్షత వహించగా పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగారావుకు సత్కారం

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో పని చేస్తున్న తేర రంగారావుని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జి మోజస్, ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ బాల అభినందించారు. పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన రంగారావు విశాఖపట్టణం ద్వారకానగరం నందు పబ్లిక్ లైబ్రరీలో దుర్యోధన మయసభ ఏకపాత్ర అభినయం పాత్రను ప్రదర్శించారు. దీంతో విశాఖపట్టణం మమత ఈవెంట్స్ కారే మమత వారి ఆధ్వర్యంలో రంగారావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ కళాశాల యాజమాన్యంతో పాటు సినీ ప్రముఖులు సత్య రెడ్డి, ప్రముఖ నటులు రంగారావును సత్కరించారు.



దంత కళాశాల ఉద్యోగి రంగారావును సత్కరిస్తున్న దృశ్యం

ముగిసిన భూమి హద్దుల నిర్ధారణ

దెందులూరు: మలకచర్ల గ్రామంలో భూమి మీద హద్దుల నిర్ధారణ పూర్తయిందని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర అన్నారు. సోమవారం మలకచర్లలో ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలంలో మలకచర్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. గ్రామంలో 883.83 ఎకరాల భూమి ఉండగా ఇప్పటికీ భూమి హద్దులు నిర్ధారణ పూర్తయిందని చెప్పారు. ఆరుగురు విలేజ్ సర్వేయర్లు, ఆరుగురు వీఆర్‌ఓలు, నలుగురు వీఆర్‌ఏలు ఈ సర్వేలో పాల్గొన్నారని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

ఐరన్ చోరీపై చర్యలకు డిమాండ్

దెందులూరు: స్థానిక హౌసింగ్ బోర్డులో దాదాపు 16 టన్నుల ఐరన్ చోరీకి సంబంధించి చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గోడౌన్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న ఐరన్ చోరీ కావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ చోరీపై పూర్తిస్థాయి విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవడంతో పాటు చోరీకి గురైన ప్రభుత్వ సొమ్మును తిరిగి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ చోరీపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామన్నారు.

నిందితుడికి రిమాండ్

ఉంగుటూరు: మోటార్‌సైకిల్ దగ్ధం చేసిన కేసులో నిందితుడికి కోర్టు రిమాండు విధించినట్లు చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. వివరాల ప్రకారం ఈనెల 8వ తేదీన కాకర్లమూడి గ్రామంలో మద్దాల నారాయణకు చెందిన మోటారు సైకిల్ దగ్ధం అయ్యింది. దీనిపై నారాయణ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో ఈ ఘటనకు సంబంధించి నిందితుడు చిన్న శ్రీనును అరెస్ట్ చేసి కోర్టుకు పంపగా రిమాండు విధించినట్లు ఎస్సై చెప్పారు. పాత గొడవల నేపథ్యంలోనే చిన్న శ్రీను నారాయణకు చెందిన మోటారుసైకిల్‌ను పెట్రోలు పోసి దగ్ధం చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



అప్పనవీడులో విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న దాతలు

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు దాతలు పరీక్షా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తోట పుష్పావతి మాట్లాడుతూ దాతల సహకారం అందిపుచ్చుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కల్వరి శక్తి మిషన్ పాస్టర్ భుక్యా బాలరాజు, అవిర్నేని విష్ణువర్ధన్‌రావు, అవిర్నేని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిలతోనే ఏలుబడి

దెందులూరు: మండలంలో కీలకమైన ఏడు గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో రెవెన్యూ సేవలు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోపన్నపాలెం, పోతునూరు, కొవ్వలి, దెందులూరు, శ్రీరామవరం, గుడికుంట, చల్ల చింతలపూడి గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాత్కాలికంగా ఆయా గ్రామాల్లో ఇన్‌చార్జి వీఆర్వోలను నియమించారు. ఒక వీఆర్‌ఓకు ఒక గ్రామంతో పాటు కచ్చితంగా ఒక శివారు కూడా ఉంటుంది. ఇప్పుడు ఇచ్చిన ఇన్‌చార్జి బాధ్యతలతో మూడు పంచాయతీలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీతో ఏడు గ్రామాల్లో ఇన్‌చార్జి వీఆర్వోలు ఎప్పుడువస్తారో, ఎప్పుడు వెళ్తారు ఆయా గ్రామాల ప్రజలకు తెలియని పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఏడు గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్‌ఓలను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం నుంచి వెదురు తడికలు మాయం

కుక్కునూరు: అటవీ శాఖాధికారులు పట్టుకున్న వెదురు తడికలను రాత్రికి రాత్రే కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే, అమరవరం అటవీరేంజ్ పరిధిలోని బర్లమడుగు గ్రామంలో ఇటీవల అటవీశాఖకు చెందిన జిల్లా అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వెదురు బొంగులను నరికి తడికలను తయారు చేసి అమ్ముతుండగా జిల్లా అధికారులు పట్టుకుని తడికలను కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం తరలించారు. కాగా వాటిని ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకు వెళ్తుండగా స్థానికులు చూసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వారిని అడ్డుకున్నారు. కాని అప్పటికే కొన్ని తడికలను తరలించుకెళ్లినట్టు సమాచారం. తడికల తరలింపులో గతంలో అటవీశాఖలో టెంపరరీగా విధులు నిర్వహించిన వ్యక్తి కీలకంగా వ్యవహరించాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా అమరవరం రేంజ్ పరిధిలో పలు ఘటనలు జరుగుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం నుంచి రాత్రివేళ తడికలను తరలిస్తున్న దృశ్యం

పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కుక్కునూరు: స్థానిక ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో మేస్సేర్స్ సాయిపవన్ ఎంటర్‌ప్రైజెస్ నందు నిల్వలో వ్యత్యాసాలు గుర్తించి రూ.38,460 విలువ గల 3 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. మేస్సేర్స్ మన రైతు సేవా కేంద్రం నందు నిల్వలో వ్యత్యాసాలు గుర్తించి రూ.63,510 విలువ గల 40 లీటర్ల ఎరువులు, మైక్రో న్యూట్రియంట్స్‌ను సీజ్ చేశారు. వీరిపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ జీ మీరయ్య, విజిలెన్స్ తహసీల్దార్ బి కన్యాకుమారి, కుక్కునూరు ఇన్‌చార్జి కె గంగాధరం, వీఆర్‌ఓ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



పురుగుమందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నిరుద్యోగులకు కూటమి దగా

- నిరుద్యోగ భృతి ఊసెత్తని ప్రభుత్వం
- ఉద్యోగాలు లేక.. భృతి అందక నిరుద్యోగుల అవస్థలు

దెందులూరు: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసింది. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో హామీలు గుప్పించారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడితే తమకు నిరుద్యోగ భృతి లభిస్తుందని నిరుద్యోగులు ఎంతో ఆశించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే పది నెలలు గడిచినా కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో ఇటు నిరుద్యోగ భృతి అందక, అటు ఉద్యోగం రాక నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, బీఈడీ, ఎంఈడీ, టీటీసీ, ఇంజనీరింగ్ ఇలా టెక్నికల్ నాన్ టెక్నికల్ కోర్సులు చేసిన నిరుద్యోగులు 532 మంది ఉన్నారు. నిరుద్యోగ భృతి ప్రభుత్వం ఇస్తే తమ జీవన విధానానికి చేదోడువాదోడుగా ఎంతోకొంత సాయం లభిస్తుందని ఆశించిన నిరుద్యోగులకు తీవ్ర నిరాశే మిగిలింది. డీఎస్సీ లేక నిరుద్యోగ భృతి ఇవ్వక తాము ఎలా జీవించాలని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు

మోసం చేయడం అలవాటే



కూటమి ప్రభుత్వం ఏర్పడి పదినెలలు గడిచి నా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. చంద్రబాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టినవిద్య. నిరుద్యోగలను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఉద్యోగం రాక, నిరుద్యోగ భృతి అందక అవస్థలు పడుతున్నాం.

–కట్టా ఏసుబాబు నిరుద్యోగి, దెందులూరు

భవిష్యత్తుకు గ్యారంటీ లేదు



బాబు షూరిటీలేదు.. భవిష్యత్తుకు గ్యారెంటీలేదు కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా నిరుద్యోగ భృతి ఇప్పటివరకు ఇవ్వలేదు. సూపర్ సిక్స్ హామీల పేరిట అన్ని ఎన్నికల ప్రచార సభల్లో ఊదరగొట్టా రు. నిరుద్యోగులను నిలువునా దగాచేశారు.

– బోరా మురళి నిరుద్యోగి, దెందులూరు

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

భీమడోలు: గుండుగొలనులోని ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ కోరారు. ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు అందకపోవడంతో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతేడాది జూన్ నెల నుంచి ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీల మస్టర్లను సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో వేతనాలు రాక వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై మండల స్థాయిలో ఉపాధి హామీ పథకం అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. కొత్త నిబంధల మేరకు కొత్త ముఠాలు ఏర్పాటు చేసే విషయంలోను కంటితుడుపు చర్యగా ముఠాలు ఏర్పాటుచేసి కొన్ని రోజులు మాత్రమే పనులు కల్పించారన్నారు. గ్రామ క్షేత్ర సహాయకుడు రాజీనామా చేసినా నేటికి కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించకుండా మరొకరికి ఇన్‌చార్జి అప్పగించారన్నారు. గ్రామంలో కోట్లలో అవినీతి జరిగిందని, సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

హేలాపురిలో ఎడారి ఓడలు



రాజస్థాన్ ఎడారిలో కనిపించే ఎడారి ఓడ (ఒంటె)లు ఏలూరు నగరంలో సోమవారం కనువిందు చేశాయి. రాజస్థాన్‌లో పనులు లేక కొందరు వలస వచ్చి ఒంటెలపై చిన్నారులను ఎక్కించి తిప్పి కొంత సొమ్ము తీసుకుని జీవిస్తున్నారు. - సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

పార్వతీ రామలింగేశ్వర స్వామి కల్యాణం.. వైభవం

ఉంగుటూరు: రాచూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగానిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిపారు. ఉత్సవ కమిటీసభ్యులు మంద శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

వెలుగు అవినీతిపై విచారణకు వినతి

ఏలూరు (టూటౌన్): వెలుగు పథకంలో నిధుల అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని వెలుగు పథకంలోని నిరుపేద దళిత మహిళలకు చెందిన కోట్లాది రూపాయలు అవినీతి జరిగిన విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, అవినీతికి పాల్పడిన ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షించేలా చూడాలని పేర్కొన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని కోరారు. తొలుత జరిగిన సమావేశంలో దళిత సేన నాయకులు బేతాళ జయసుధ, సికాకొల్లు స్టాలిన్, పింగుల ఇథియ, మోనూరి దేవ మాత, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నేతల ధర్నా

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో ఆర్‌వీ రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మర్లగూడెం, ఇనుమూరు, జైనవారిగూడెం, సిరివారిగూడెం గ్రామాల పరిధిలో 150 ఎకరాలకు పైగా ఎల్‌టీఆర్ భూములు ఉన్నాయని, వాటిని 25 ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్నారన్నారు. ఈ భూములకు సంబంధించి అధికారులు, పోలీసులతో పాటు స్థానిక ఎమ్మెల్యే సైతం భూస్వాముల వైపు మాట్లాడుతున్నారన్నారు. దీని వల్ల ఏళ్ల తరబడి సాగులో ఉన్న గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ బుట్టాయిగూడెంలోని ఇళ్లస్థలాలకి సర్వేచేసి ప్రభుత్వభూమి గిరిజనులకు అప్పచెప్పమని అధికారులను ఆదేశించినప్పటికీ కనీసం ఇప్పటి వరకు బుట్టాయిగూడెం తహసీల్దార్ కనీసం అటువైపు చూడటం లేదన్నారు. ఏజెన్సీ భూసమస్యలు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు, ఎం.జీవరత్నం, పోలోజు నాగేశ్వరరావు, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్ పాల్గొన్నారు.